# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 2 | సంచిక: 225 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 22 నవంబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్


## మూసీలో ఆదానీ వాటా

# ఎంతో చెప్పండి?

### ఆదానీతో కాంగ్రెస్, బీజేపీ అనుబంధం దేశానికి అవమానం

- అగ్రరాజ్యం అమెరికానే మోసం చేయాలని చూసిన ఘనుడు
- భారత ప్రభుత్వ అధికారులకు లంచం ఇవ్వజూపిన మోసగాడు
- రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు బేరమెంత?
- మూసీలో ఆదానీ వాటా ఎంతో చెప్పండి
- తెలంగాణలో పెట్టుబడుల అనుమతులు ఎలా ఇచ్చారు?
- తక్షణం అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలి
- ఆదానీతో చేసుకున్న చీకటి ఒప్పందాలు అన్నీ బయట పెట్టాలి
- తెలంగాణలో ఆస్తులను కొల్లగొట్టే మీ కుయుక్తులు
- అందులో మీ భడే భాయ్ వాటాఎంత ?.. ఆదానీ భాయ్ వాటా ఎంత?
- మీ హైకమాండ్ వాటా ఎంత?.. రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు
- పిల్లలు పిట్టల్లా రాలుతుంటే దిద్దుబాటు చర్యలేవి?
- విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించలేని రేవంత్..
- మహిళలను కోటీశ్వరులను చేస్తాడట
- వేదికల మీదికెక్కి పిట్టలదొర మాటలు
- సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు



హైదరాబాద్, నవంబర్ 21 (ప్రభాత ఉదయం): ఆదానీ గ్రూప్స్ అధినేత గౌతమ్ అదానీపై యూఎస్ అభియోగాలు నమోదయ్యాయి. కంపెనీ అధికారులకు లంచాలు ఇవ్వజూపడంతోపాటు ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి నిధుల సమీకరణకు పాల్పడినట్లుగా న్యూయార్క్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు

..మిగతా 2లో

## మూసీ పునరుజ్జీవం నుంచి

# వెనక్కి తగ్గం

### ఎన్ని శక్తులు అడ్డుపడినా పూర్తి చేస్తాం
### హైదరాబాద్‌ను ప్రపంచస్థాయికి తీసుకు వెళతాం
### సిఎం రేవంత్



హైదరాబాద్, నవంబర్ 21 (ప్రభాత ఉదయం): మూసీ నదిని ప్రక్షాళన చేసి హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తుందని, ఎన్ని శక్తులు అడ్డుపడినా పక్రియ పూర్తి చేసే బాధ్యతను కాంగ్రెస్ ప్రభత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'నదుల వెంట నాగరికత వర్ధిల్లాలి..నదులను కబళిస్తే.. మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. ప్రజా ఆరోగ్యం పటిష్ఠ ఆర్థికం పర్యావరణ కోణాల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందాల్సిన హైదరాబాద్‌కు మూసీ ఒక వరం కావాలి. కానీ, శాపంగా మిగిలిపోకూడదు. మూసీ ప్రక్షాళన చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పం. ఈ తరానికే కాదు.. తరతరాలకు

..మిగతా 2లో



## గత ప్రభుత్వానిది గడీల పాలన

# మాది ప్రజా పాలన

### కోటి మంది మహిళలను... కోటీశ్వరులను చేస్తాం
### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, నవంబర్ 21 (ప్రభాత ఉదయం): ప్రజా ప్రభుత్వం ప్రజలతో మమేకం అవుతూ ప్రజల సమస్యలు తెలుసుంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అందుకోసమే ముఖాముఖీ కార్యక్రమం కి వచ్చామని తెలిపారు. ప్రలజావాణితో పాటు పార్టీ భావజాలం నమ్మి ఓటేసిన ప్రజల అభిప్రాయాలను, ఇబ్బందులను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం తీసుకువచ్చామని చెప్పారు. గత ప్రభుత్వం ఎప్పుడూ గడీల మధ్య ఉండి పాలన చేసిందని విమర్శించారు. ఈ ప్రభుత్వం ప్రజా పాలన చేస్తుందని అన్నారు. విద్య,

..మిగతా 2లో

# కోటి దీపోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము

### రెండు రోజుల పర్యటన నిమిత్తం హైదరాబాద్‌కు... స్వాగతం పలికిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు



హైదరాబాద్, నవంబర్ 21 (ప్రభాత ఉదయం): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల పర్యటన నిమిత్తం హైదరాబాద్ కు చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో రాష్ట్రపతి బేగంపేట విమానాశ్రయానికి వస్తున్న సందర్భంగా ముందుగానే గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి సీతక్క పలువురు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఢల్లీ నుండి ప్రత్యేక విమానంలో రాష్ట్రపతి రాగానే గవర్నర్, సీఎం రేవంత్ రెడ్డి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి పుష్పగుచ్ఛాన్ని అందించి, పలువురు అధికారులు కూడా స్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే కోటి దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్రపతి


..మిగతా 2లో

# కబ్జా ఆరోపణలు రుజువు చేయాలి

### రేవంత్ రెడ్డివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు
### హరీష్ రావు ఘాటు విమర్శలు

2






# ఆడబిడ్డకో న్యాయం... ఆదానీకో న్యాయమా?

### మోడీని విమర్శిస్తూ ఎమ్మెల్సీ కవిత ట్వీట్

హైదరాబాద్, నవంబర్ 21 (ప్రభాత ఉదయం): అదానీ వ్యవహారంపై బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కవిత సంచలన ట్వీట్ చేశారు. బీజేపీ, ప్రధాని మోదీపై కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. జైలు నుంచి విడుదల అయ్యాక తొలిసారి కవిత రాజకీయ వ్యాఖ్యలు చేశారు. ఎన్నిసార్లు ఎన్ని ఆరోపణలు వచ్చినా ప్రధాని అదానీ వైపేనా అని కవిత ప్రశ్నించారు.అఖండ భారతంలో అదానికో న్యాయం ఆడబిడ్డకో న్యాయమా అని ప్రశ్నించారు. ఆధారాలు లేకున్నా ఆడబిడ్డను కాబట్టి అరెస్ట్ చేయడం ఈజీ. ఆధారాలు ఉన్నా అదానీని అరెస్ట్ చేయడం మాత్రం కష్టమా అని కవిత ప్రధానిని ప్రశ్నించారు. ఎన్ని సార్లు ఆరోపణలు వచ్చినా ప్రధాని అదానీ వైపేనా అని సూటిగా ప్రశ్నించారు కవిత.

# డిసెంబర్ 9వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు

### పలు బిల్లుల ఆమోదం కోసం ప్రభుత్వం కసరత్తు



హైదరాబాద్, నవంబర్ 21 (ప్రభాత ఉదయం): తెలంగాణ అసెంబ్లీ సమావేశాలపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. డిసెంబర్ 9వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయని ప్రభుత్వం వెల్లడించింది సమావేశాల్లో పలు కీలక చట్టాల ఆమోదానికి రేవంత్ సర్కారు సన్నద్ధం చేస్తోంది. ఆర్ఓఆర్ చట్టాన్ని ఆమోదించాలని చూస్తోంది. రైతు, కులగణన సర్వేపై కూడా సమావేశాల్లో చర్చించే అవకాశం కనిపిస్తోంది. అసెంబ్లీ సమావేశాలతో పాటు మంత్రివర్గ విస్తరణ మీద కూడా ప్రభుత్వం ఫోకస్ పెట్టిందని తెలుస్తోంది.డిసెంబర్ 7వ తేదీతో రేవంత్ సర్కార్ ఏడాది కాలం పూర్తి చేసుకోనుంది. దీంతో మంత్రివర్గ విస్తరణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిసింది. అయితే మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల తర్వాతే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని వినిపిస్తోంది. కానీ ఆలోపే మంత్రివర్గాన్ని విస్తరించేందుకు కసరత్తు జరుగుతోందని కూడా సమాచారం అందుతోంది. మరోవైపు పంచాయతీ ఎన్నికలపై కూడా ప్రభుత్వం కసరత్తు చేస్తోందని తెలుస్తోంది. త్వరలో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని

..మిగతా 2లో

## మూసీలో ఆదానీ వాటా

# ఎంతో చెప్పండి?

మొదటి పేజీ తరువాయి...

ఆరోపించారు. ఆదానీ గ్రూప్స్ అధినేత గౌతమ్ అదానీపై యూఎస్ అభియోగాలు నమోదయ్యాయి. కంపెనీ అధికారులకు లంచాలు ఇవ్వజూపడంతోపాటు ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి నిధుల సమీకరణకు పాల్పడినట్లుగా న్యూయార్క్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆసక్తికర ట్వీట్ చేశారు. అగ్రరాజ్యం అమెరికానే మోసం చేయాలని చూసిన ఘనుడు.. భారత ప్రభుత్వ అధికారులకు లంచం ఇవ్వజూపిన మోసగాడని విమర్శించారు. అదానీతో కాంగ్రెస్, బీజేపీ అనుబంధం దేశానికి అవమానం, అరిష్టమన్నారు. రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఎంత ఇవ్వజూపిండో, మూసీలో అదానీ వాటా ఎంతో అంటూ ప్రశ్నించారు. ఇలాంటి మోసగాడికి.. దగాకోరుకా.. తెలంగాణలో పెట్టుబడుల అనుమతులు ఎలా ఇచ్చారంటూ మండిపడ్డారు. తక్షణం అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని.. అదానీతో చేసుకున్న చీకటి ఒప్పందాలు అన్నీ బయట పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఆస్తులను కొల్లగొట్టే మీ కుయుక్తులలో మీ భడే భాయ్ వాటాఎంత ? మీ అదానీ భాయ్ వాటా ఎంత? మీ హైకమాండ్ వాటా ఎంత? అంటూ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా నిలదీశారు.గౌతమ్ అదానీ, ఆయన బంధువు సాగర్‌తో పాటు మరో ఏడుగురిపై అభియోగాలు నమోదయ్యాయి. అదానీ, అనుబంధ సంస్థలు 20 సంవత్సరాల్లో రెండు బిలియన్ డాలర్ల లాభం పొం సోలార్ పవర్ ప్లాంట్ ఒప్పందాలను పొందేందుకు భారత ప్రభుత్వ అధికారులకు 265 మిలియన్ డాలర్ల లంచాలు ఇవ్వ జూపినట్లుగా ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. అమెరికాతో పాటు ఇంటర్‌నేషనల్ ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి నిధులను సమీకరించేందుకు కంపెనీ ప్రయత్నించారని అభియోగాలు మోపారు.అదానీ గ్రీన్ ఎనర్జీలో అక్రమ మార్గాల ద్వారా కంపెనీ మూడు బిలియన్ డాలర్లకుపైగా రుణాలు, బాండ్లను సేకరించినట్లుగా న్యూయార్క్ ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ మరో సివిల్ కేసు నమోదు చేసింది. యూఎస్ సెక్యూరిటీ చట్టాలను ఉల్లంఘించి అదానీ గ్రీన్ ఎనర్జీ అమెరికా ఇన్వెస్టర్ల నుంచి 175 మిలియన్ డాలర్లకుపైగా సేకరించినట్లుగా ఆరోపించింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపి జరిమానాతో పాటు కంపెనీపై ఆంక్షలు విధించాలని రెగ్యులేటర్ కోరింది. సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శనాస్త్రాలు సంధించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించలేని రేవంత్.. మహిళలను కోటీశ్వరులను చేస్తాడట అంటూ మండిపడ్డారు. రోజుకో గురుకుల పాఠశాలలో ఆహారం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నడూ లేనిది గురుకుల పాఠశాల్లో ఇప్పటి వరకు 40 మందికి పైగా విద్యార్థులు మరణించారని చెప్పారు. పిల్లలు పిట్టల్లా రాలుతుంటే దిద్దుబాటు చర్యలు తీసుకోకుండా వేదికల మీదికెక్కి పిట్టలదొర మాటలు చెబుతున్నాడని విమర్శించారు. తల్లికి బువ్వ పెట్టనోడు చిన్నమ్మకు బంగారు గాజులు చేయించాడట అని ఎద్దేవా చేశారు. దవాఖానల్లో విద్యార్థులు, చెరసాలలో రైతన్నలు, ఆందోళనలో నిరుద్యోగులు.. జాగో తెలంగాణ అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.



## ఆదానీని తక్షణమే అరెస్ట్ చేయాలి

### సెబీ చీఫ్ మాధభి పురీ బచ్‌పైనా విచారణ జరిపించాలి

### ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్

న్యూఢిల్లీ, నవంబర్ 21 (ప్రభాత ఉదయం): లంచం ఆరోపణలపై అమెరికాలో కేసు నమోదైన అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీని తక్షణమే అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. సెబీ చీఫ్ మాధభి పురీ బచ్‌పైనా విచారణ జరిపించాలన్నారు. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈసందర్భంగా ప్రధాని మోదీపై మరోసారి విమర్శలు ఎక్కుపెట్టారు. అమెరికా, భారత చట్టాలను అదానీ ఉల్లంఘించారనే విషయంపై ఇప్పుడు స్పష్టత వచ్చిందని రాహుల్ గాంధీ అన్నారు. మోదీ, అదానీల బంధం భారత్‌లో ఉన్నంత వరకే సురక్షితమన్నారు. తాజా ఆరోపణలపై తక్షణమే జేపీసీతో విచారణ జరిపించాలన్నారు. శీతకాల సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామన్నారు. తన అవినీతి ద్వారా దేశ ఆస్తులన్నీ అదానీ కొల్లగొట్టారని ఆరోపించారు. ఆయనను వెంటనే అరెస్ట్ చేసి విచారిస్తే విషయాలన్నీ బయట పడతాయని అన్నారు. ఆయనను రక్షిస్తున్న సెబీ చీఫ్‌ను ఆ పదవి నుంచి తొలగించి ఆమె పైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. లంచం ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా సంబంధం లేకుండా విచారణ జరిపించాలని రాహుల్ గాంధీ కోరారు. 'అదానీ అరెస్టు కాదని, ఆయనపై విచారణ జరగదని నేను గ్యారంటీ ఇస్తాను. ఎందుకంటే ఆయన్ను మోదీ కాపాడుతున్నారు' అని రాహుల్ గాంధీ ఆరోపించారు.



## మూసీ పునరుజ్జీవం నుంచి

# వెనక్కి తగ్గం

మొదటి పేజీ తరువాయి...

మేలు చేసే నిర్ణయం. ఈ నిర్ణయానికి అండగా నిలవాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఎక్స్‌లో సీఎం రేవంత్ ఓ పోస్ట్ చేశారు. కాగా.. మూసీ పరీవాహక ప్రాంతంమురికి కూపంగా మారి.. హైదరాబాదీలకు విష వాయువులు అందిస్తుందని, దుర్భరంగా మారిన వారి జీవన విధానం మార్చేందుకు మూసీని ప్రక్షాళన చేసి, పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మూసీ వెంట నరకం అనుభవిస్తోన్న పేదవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రాబోయే రోజుల్లో యాదవులకు అత్యధికంగా సీట్లు ఇస్తామని, కార్పొరేటర్లు, ఎమ్మెల్యే, ఎంపీ, ప్రజాప్రతినిధులుగా అవకాశాలు పెంచి నాయకులుగా తీర్చిదిద్దే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును అడ్డుకోవాలని చూసేవారు కుక్కచావు చస్తారని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. బుల్డోజర్లు ఎక్కించి అయినా ప్రాజెక్టును చేపట్టి తీరతామని ప్రకటించారు. మూసీ కాలుష్యం వల్ల ఆ నది పరీవాహక ప్రాంత ప్రజలు అణుబాంబుతో కలిగే ప్రమాదం కంటే ఎక్కువ దుష్పరిణామాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వరంగా ఉండాల్సిన మూసీ.. శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ పునరుజ్జీవంతోనే వారికి ఆ సమస్య నుంచి విముక్తి కలుగుతుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గంగా, సబర్మతి నదులను రూ.40 వేల కోట్లతో సుందరీకరణ చేసుకుంటే, తాను తెలంగాణ ముఖ్యమంత్రిగా మూసీ పునరుజ్జీవం చేయొద్దా? అని ప్రశ్నించారు. ప్రధాని చేసిన పనిని మెచ్చుకుంటూ.. మూసీ ప్రక్షాళనపై నకిలీ బీజేపీ నేతలు అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. కమీషన్ల కోసమే మూసీ ప్రాజెక్టు చేపట్టానని బీఆర్ఎస్ అంటోందని, ఈ మూసీ ప్రక్షాళన చేయకపోతే తన జన్మ దండగ అని భావోద్వేగానికి లోనయ్యారు. 'రూ.1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన చేపట్టి.. రూ.25 వేల కోట్లు దోచుకునే ప్రయత్నం చేస్తున్నామంటున్నారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### డిసెంబర్ 9వ తేదీ నుంచి

## శాసనసభ సమావేశాలు

మొదటి పేజీ తరువాయి...

భావిస్తోంది. పంచాయతీ ఎన్నికలకు ముందే ఆసరా పెన్షన్, రైతు భరోసా పథకం కింద ఇచ్చే మొత్తాన్ని పెంచేందుకు రేవంత్ సర్కారు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఎలక్షన్స్‌కు ముందు పెన్షన్, రైతు భరోసాను పెంచితే ప్రభుత్వానికి మంచి పేరుతో పాటు పార్టీకి మైలేజీ వస్తుందని భావిస్తున్నారట. అసెంబ్లీ సమావేశాలు, పంచాయతీ ఎన్నికల మీద ఫోకస్ పెట్టిన సీఎం రేవంత్.. అందుకు అనుగుణంగా కులగణను చేపట్టారు. మరోవైపు కొండపోచమ్మ సాగర్ దగ్గరలోని మాజీ మంత్రి హరీష్ రావు ఫామ్‌హౌస్‌పై విచారణ జరిపించాలని నిర్ణయించారు. గత పదేళ్లలో కెసిఆర్ ప్రభుత్వం చేసిన అవినీతికి సంబంధించి అసెంబ్లీలో వాడీవేడీ చర్చకు ప్రభుత్వం సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది.



## కోటి దీపోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము

మొదటి పేజీ తరువాయి...

కాన్వాయ్ బయలుదేరి వెళ్ళింది. రాష్ట్రపతి కాన్వాయ్ ప్రయాణించే మార్గాల్లో, పోలీసులు అడుగడుగునా నిఘా ఉంచారు. రెండు రోజుల పాటు రాష్ట్రపతి పర్యటన సాగుతున్న సందర్భంగా, హైదరాబాద్ పోలీసులు పలు ప్రాంతాలలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.శుక్రవారం మాదాపూర్ శిల్పకళా వేదికగా నిర్వహించే లోక్ మంతన్ కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో సుమారు 120 దేశాలకు చెందిన 1500 మంది ప్రతినిధులు పాల్గొంటారని సమాచారం. రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పర్యటన సందర్భంగా పోలీసులు హైదరాబాద్ లో భారీ బందోబస్తు చేపట్టారు.

### గత ప్రభుత్వానిది గడీల పాలన

## మాది ప్రజా పాలన

మొదటి పేజీ తరువాయి...



వైద్యం మీద ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తోందని చెప్పారు. పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు 40 శాతం పెంచి అందిస్తున్నామని వెల్లడిరచారు. అనేక పథకాలతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం రాగానే ప్రక్షాళన చేసి 50వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. పదేళ్లలో గ్రూప్ 1 పరీక్షలు సరిగ్గా నిర్వహించలేక గాలికి వదిలేశారని విమర్శించారు. కుటిల ప్రయత్నాలను తట్టుకొని ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని అన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ ఆ వడ్డీని ప్రభుత్వం కట్టనుందని చెప్పారు. మహిళా సంఘాలతో వెయ్యి మెగా ఓల్ట్ ల విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందం చేసుకున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని స్పష్టం చేశారు. అడ్వాన్స్ టెక్నాలజీ తో ముందుకు వెళ్లేలా ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని చెప్పారు. ఇది పేద బడుగు బలహీన వర్గాల ప్రభుత్వమని, కుల గణన చారిత్రాత్మక విజయమని అన్నారు. దేశానికి తెలంగాణ మోడల్ గా కుల గణన నడుస్తుందని తెలిపారు. కుల గణనను అడ్డుకోవాలని దోపిడీ దారులు ప్రయత్నం చేస్తున్నారని, వనరులు ప్రజలకు సమానం చేస్తామని హామీ ఇచ్చారు.

# రేవంత్ రెడ్డివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

### హరీష్ రావు ఘాటు విమర్శలు

సంగారెడ్డి, నవంబర్ 21 (ప్రభాత ఉదయం): బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు సీఎం రేవంత్ రెడ్డితెరలేపుతున్నాడని సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. భూ కబ్జాలకు పాల్పడుతున్నాడని సీఎం చేసిన తప్పుడు ఆరోపణలపై ఘాటుగా స్పందించారు. గురువారం అందోల్ మండలం మాసాన్‌పల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగనాయక సాగర్ దగ్గర ఇరిగేషన్ భూములను కబ్జా చేశానని నాపై రేవంత్ రెడ్డి తప్పుడు ఆరోపణ చేశాడు.పచ్చకామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కనిపిస్తుంది అన్నట్లు కబ్జాలు చేసే చరిత్ర నీదని ధ్వజమెత్తారు. రైతుల పట్టా భూములను ధరణి ద్వారా13 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వివరించారు. ఒక గుంట కానీ, ఒక ఎకరా కానీ ఇరిగేషన్ భూమి కానీ, ప్రభుత్వ భూమి కానీ తీసుకున్నట్టు నా చరిత్రలో లేదని స్పష్టం చేశారు. ఏ భూమిని అయితే నేను రిజిస్ట్రేషన్ చేసుకున్నానో ఆ భూమిలోనే ఉన్నాను.నువ్వు ఎప్పుడు వస్తావో చెప్పు రేవంత్ రెడ్డి.. నీ సమక్షంలోనే సర్వే చేద్దాం. నువ్వు ఎన్ని బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేసినా భయపడేది లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరపున రైతుల పక్షాన నిన్ను ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రేవంత్ రెడ్డి రైతులకు తొమ్మిది హామీలను అమలు చేస్తామని ప్రకటించారు. ఇందులో ఏ ఒక్క హామీనైనా



నెరవేర్చగలిగాడా అని ప్రశ్నించారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం వడ్ల కొనుగోళ్లలో సైతం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర కల్పించడంలో, పెట్టుబడి సాయం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. రాష్ట్రంలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. మరోపక్క సివిల్ సప్లై కమిషనర్ 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొంటామని ప్రకటించారు. దీని ఆంతర్యమేమిటని నిలదీశారు. మధ్యలో 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఎక్కడికి పోయిందో చెప్పాలన్నారు. రైతులు పండిరచిన ధాన్యంలో సగం దళారుల పాలయింది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత, గిరిజన, అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి ఆ భూములను రాష్ట్ర ప్రభుత్వం కొల్లగొడుతున్నది. కంపెనీ నిర్మాణాల కోసం ఆ భూములను తన ఆప్తులకు కట్టబెట్టే ప్రయత్నం సీఎం చేస్తున్నాడు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న కేటీఆర్ పై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు.

# దుర్గానగర్‌లో రూ.10 కోట్లతో చేపడుతున్న బాక్స్ టైప్ డ్రెయిన్, సీసీ రోడ్డు, రిటర్నింగ్ వాల్‌లను పరిశీలించిన ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్



దుర్గానగర్‌లో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్..



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

బుద్వేల్, నవంబరు 21(ప్రభత ఉదయం) : దుర్గానగర్ చౌరస్తా నుంచి దుర్గానగర్ వీధుల గూండ పల్లె చెరువు వరకు రూ. 10 కోట్లతో చేపడుతున్న జాక్స్ టైప్ డ్రెయిన్, సినీ రోడ్డు, రిటర్నింగ్ వాల్ పనులను గురువారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ పనులు ఇప్పటికీ 95శాతం అయిపోయాయి స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ జీహెచ్ఎంసీ ప్రాజెకు డీఈ సలావుద్దిన్, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్, ఈఈ నరేందర్ గౌడ్, ఏఈ నర్సింహ్మ మూర్తి, జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ రేణుక, మాజీ కార్పొరేటర్ టి. ప్రేందాస్ గౌడ్ లతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా దుర్గానగర్ బస్తీ ప్రజలు ఇంకా పలు చోట్ల బాక్స్ టైప్ డ్రెయిన్ కు కనెక్షన్ కలపాల్సిన చోటును అధికారులకు ఎమ్మెల్యే సమక్షంలో చూపించారు. దుర్గానగర్ చౌరస్తాతో పాటు బస్తీ లో పలు ప్రాంతాలలో బాక్స్ టైప్ డ్రెయిన్ కు కనెక్షన్ కలపాలని ఆ పనులను కూడా చేయించాలని కోరారు. అప్పటి వరకు కాంట్రాక్టర్ కు బిల్లులు ఇవ్వవద్దని విన్నవించారు . రూ.10 కోట్లతో చేపడుతున్న పనులు పూర్తిగా అయిన తర్వాతనే కాంట్రాక్టరుకు బిల్లులు ఇస్తే బాగుంటుందన్నారు. దుర్గానగర్ బస్తీ లో డ్రెయిన్ లీకేజీ లు ఎక్కడెక్కడ జరుగుతున్నాయో స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు చూపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, ఎస్టిమేషన్ లో ఉన్న మాదిరిగా అన్ని పనులు పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. అన్ని జంక్షన్ల వద్ద డ్రైనేజికి కనెక్షన్లు కలపాలన్నారు. బాక్స్ డ్రెయిన్ పక్కన మట్టి లేదా సిమెంటుతో ఫిల్లింగ్ చేయాలని, వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సరికొండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## వివాహ వార్షికోత్సవం సందర్భంగా 22 సంవత్సరాల వివాహ వేడుక



బుద్వేల్, నవంబరు21(ప్రభాత ఉదయం): 22 సంవత్సరాల వైవాహిక జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ...మరెన్నో జయపజయాలు.. అనేక సమస్యలు ఆపైన సంతోషా లు... వాటిని మించి దేవుని ఆశీర్వాదాలు, దీవెనలు... ఇలా ఎన్నో మధురా నుభూతుల కలయికతో 22 సంవత్సరాలు ఇట్లే గడిచిపోయాయి . 22 సంవత్సరాల లో దేవుడు ఎంతగానో ఆశీర్వదించాడు. చక్కని సంతానం... అందమైన గృహం... అండగా నిలబడే అన్నదమ్ములు... ఆప్యాయతలు పంచే చెల్లెలు వారి కుటుంబాలతో పాటు సమస్యలలో వెన్నంటి ఉండి భుజం తట్టి నడిపించే స్నేహితులు... ఆదరించే సంఘ సభ్యులు... దేవునిలో నడిపించే ఆత్మీయ తల్లిదండ్రులు... అనుదినం ప్రార్థించే దైవజనులు... వీరందరి మధ్య 22 సంవత్సరాలు 22 రోజులుగా అన్నట్లు గడిచిపోయాయి. భవిష్యత్తులోనూ దేవుడు చల్లగా చూడాలని... ప్రతి ఒక్కరు అండగా నిలిచి ఆదరించాలని కోరుకుంటూ...

ఇట్లు,
మీ అప్పారెడ్డిగూడెం భీమయ్య-మాధవి



## నేడు రాజేంద్రనగర్, హిమాయత్ సాగర్, షాపూర్‌లలో విద్యుత్ సరఫరా లో అంతరాయం

రాజేంద్రనగర్, నవంబర్ 21(ప్రభాత ఉదయం) వ్యవసాయ విశ్వవిద్యాలయం లో గల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గాంధీనగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో వివిధ మరల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలైన గాంధీనగర్, చౌడమ్మ టెంపుల్, ఎమ్ఐ సాగర్ కట్ట కాలనీ, రాజేంద్రనగర్ ప్రధాన రహదారి ప్రభుత్వ కార్యాలయాల లో ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు, నార్మ టైపు -1,2 క్వార్టర్స్ మేనేజ్ ప్రధాన రహదారి ప్రాంతాలలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా అనిల్ వేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ దుర్గాప్రసాద్ తెలిపారు విద్యుత్ వినియోగదారులు ఎంత రాయానికి సహకరించాలని ఆయన కోరారు.

### హిమాయత్ సాగర్ లో...

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో కాళీ మందిర్ విద్యుత్తు ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఇండస్ వ్యాలీ, సంజయ్ గాంధీ నగర్, భవాని కాలనీ, బైరాగి గూడ, శివ సాయి నగర్, సుబ్రహ్మణ్య కాలనీ, రంగారెడ్డి కాలనీ, దత్తాత్రేయ కాలనీ, వాల్మీకి ఆశ్రమం, శివపురి, గంధం గూడ గృహాలు ప్రాంతాలలో ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సాయిరాం విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన సాయి హర్షకాలని, సాయిరాం నగర్, సాయిరాం ఎంక్లేవ్, సౌభాగ్యనగర్, ప్రాంతాలలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ బి అమర్ సింగ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఎంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

### షాపూర్ లో...

షాపూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు.

ముచ్చింతల విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 10.00 గంటల నుండి 13.00 వరకు ముచ్చింతల్, మదనపల్లి పాత తాండ, మేకల బండ తాండ, కుటీరం విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 14.00 గంటల నుండి 17.00 గంటల వరకు ప్రాంతాలలో సమతా మూర్తి, కుటీరం, జిమ్స్ హాస్పిటల్, స్వర్ణ భారత్ ట్రస్ట్, జేబీఎం గార్డెన్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.



## ప్రభుత్వం ఇచ్చిన జీవోలు అమలు చేయాలి: వి జైపాల్ రెడ్డి

### మున్సిపల్ కార్మికులకు 26 వేలు కనీస వేతనం ఇవ్వాలి


రాజేంద్రనగర్, నవంబరు 21(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాప్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కే ఏసురత్నం, రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ వనంపల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కమిషనర్ ఆఫ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శ్రీదేవి కి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో కార్మికులకు కనీస వేతనాలు రూ.26,000/లు అమలు చేయాలని కార్మిక సంఘాలు పోరాటాలు నిర్వఇస్తున్నాము. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు పెంచేంతవరకు గత రాష్ట్ర ప్రభుత్వం జీ.ఓ. ఎంఎస్ నెంబర్ 60 తేదీ:11/6/2021 రోజు విడుదల చేయడం జరిగింది. రాష్ట్రంలో ఉన్నటువంటి మున్సిపాలిటీలలో పనిచేస్తున్న వివిధ కేటగిరీల వారీగా కార్మికులకు పైన పేర్కొన్న జీ.ఓ ప్రకారం వేతనాలు ఇవ్వాలి. రాష్ట్రంలో కొన్ని మున్సిపాలిటీలలో రెండు పూటల పని విధానాన్ని నిర్వహిస్తున్నారు. ఈ యొక్క విధానాన్ని రద్దు చేసి ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు కార్మికులను పనుల్లో కొనసాగించాలి. ఉదయం చలి ఎక్కువగా ఉందన్న దృశ్య కార్మికులను ఉదయం 6:30 గంటలకు హాజరు తీసుకోవాలని కోరడం జరిగింది. జీ.ఓ నెంబర్ 60 ప్రకారం డ్రైవర్స్ , వాటర్ సప్లై , ఎలక్ట్రిషన్ , సూపర్ వేజర్స్ , డేటా ఆపరేటర్స్ , లకు ₹.19500/-లు అమలు చేయాలి. కంప్యూటర్ ఆపరేటర్స్ , వర్క్ ఇన్స్పెక్టర్ , కార్మికులకు ₹.22,750/-లు వేతనాలను అమలు చేయాలని కోరడం జరిగింది. జీ.ఓ ఇచ్చిన నాటినుండి నేటి వరకు వీరికి రావాల్సిన ఏరియర్స్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి. కార్మికులకు 60 సంవత్సరాలు పైబడిన కార్మికునికి 5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి. విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదం లో మరణించిన కార్మిక కుటుంబానికి ₹.25 లక్షలు ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపాలిటీలో ఈనెల తేదీ :7/11/2024 ఉదయం 5:30 గంటలకు విధులు నిర్వహిస్తున్న కార్మికులపై ఆర్టీసీ బస్సు అదుపుతప్పి కార్మికులు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ జిల్లాలో ఈఎస్ఐ సదుపాయం లేక కార్మికులకు వైద్యం చేయించు కొనుటకు దాదాపు 90 కిలోమీటర్ల సిరిపూర్ కాగజ్ నగర్ వెళ్లవలసి పరిస్థితి నెలకొన్నది. కావున జగిత్యాల జిల్లాలో ఈఎస్ఐ వైద్యాలయం మున్సిపల్ అధికారులు తక్షణమే ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికులకు ఐడెంటి కార్డు ఇవ్వాలని కమిషనర్ గారిని కోరడం జరిగింది. మీరు ఇచ్చిన మెమోరాండంలో ఉన్నటువంటి సమస్యలపై పరిశీలించి అన్ని మున్సిపాలిటీలకు ఆదేశాలు ఇస్తానని హామీ ఇవ్వడం జరిగింది.



చండీయాగంలో పాల్గొన్న భక్తులు

## హైదర్‌గూడ దుర్గామాతకు ప్రాణ ప్రతిష్ట

### చండీ యాగం, అన్నదాన కార్యక్రమాలు



అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

బుద్వేల్, నవంబరు21(ప్రభాత ఉదయం): హైదర్‌గూడ శ్రీ దుర్గామాత దేవాలయం పునర్నిర్మాణం పూర్తయింది. మహబలేశ్వరం లో రూపొందించిన దుర్గామాత విగ్రహానికి వేద బ్రాహ్మణ పండితుల వేద మంత్రోచ్చరణల మధ్య ఆలయంలో గురువారం ప్రాణ ప్రతిష్ట చేశారు. ఈ సందర్భం గా ఆలయ ధర్మకర్త చెట్టిగారి వసంతరావు ఆద్వర్యంలో గణపతి హోమం, చండీ యాగం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రణవభక్త సమాజం అధ్యక్షుడు మోంద్ర నర్సింహ్మా, మల్లారెడ్డి, వివిధ పార్టీల నాయకులు కొలన్ సుబాష్ రెడ్డి, చెట్టిగారి నరేందర్, ఎన్. మల్లారెడ్డి, వనం సహింహ్మా, సోమారం రాజకుమార్, ఎస్.జయానందరెడ్డి, మ్యాడం ప్రవీన్ కుమార్, సులిగె వెంకటేశ్, సామాజిక కార్యకర్త మ్యాడం. మదుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



## మత్స్యకారులు అభివృద్ధి చెందాలి

### ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి
### గద్వాలలో ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం
### జెండావిష్కరణ చేసిన ఎమ్మెల్యే

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 21(ప్రభాత ఉదయం) ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని తెలుగు పేట శివాలయం నందు గద్వాల మత్స్యకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మత్స్య కార్య దినోత్సవ వేడుకలకు గద్వాల శాసనసభ్యులు కృష్ణ మోహన్ రెడ్డి హాజరై ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తెలుగు ముదిరాజ్ జెండా ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి చేతులమీదుగా ఆవిష్కరణ చేసారు.ముందుగా ఎమ్మెల్యే కు తెలుగు ముదిరాజ్ సంఘం నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ...తెలుగు ముదిరాజ్ సోదరులు లందరికీ ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ శుభాకాంక్షలు.మత్స్యకారులు అభివృద్ధి చెందాలి వారి కులవృత్తి అయిన చాపల వేటను మత్స్యకారులకు వృత్తిపరమైన వారికి అన్ని రకాల సౌకర్యాలు ప్రభుత్వము కల్పించాలి. అదేవిధంగా భవిష్యత్తులో మత్స్యకారులను కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వారి సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా ప్రభుత్వం కూడా కృషి చేయాలని సీఎంను కోరడం జరుగుతుంది.మత్స్యకారులకు ఎటువంటి ఇబ్బంది ఉన్న నా దృష్టికి తీసుకురండి ప్రత్యేకంగా వారికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయి అదే విధంగా మత్స్యకారుల అభివృద్ధి కొరకు వారు ఆర్థికంగా బలోపేతం చెంచడం కొరకు ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకువెళ్లి మత్స్యకారుల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గడ్డం కృష్ణారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్ కౌన్సిలర్స్ దౌలు,టి. శ్రీను, నరహరి గౌడ్ రిజ్వాన్, నాయకులు గోవిందు సతీష్ వంట భాస్కర్, దౌలన్న లక్ష్మన్న, కురుమన్న, మధు హనుమంతు , ఆంజనేయులు, కొత్త గణేష్ పరశురాముడు, చందు, పాండు, హరి, నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలలో డ్రైనేజీ అవుట్ లెట్ల సమస్యలు పరిష్కరించాలి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 21(ప్రభాత ఉదయం) అల్వాల్ సర్కిల్ పరిధిలోని మూడు డివిజన్ల సమస్యల పై స్థానిక ప్రజలు, కార్పొరేటర్ల తో కలిసి కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ను కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వివరించారు .మచ్చబోల్లారం డివిజన్ పరిధిలోని ఏడు కాలనీల డ్రైన్ ఔట్లేట్ సమస్య శ్రీదామ్ కాలనీ,మడికట్ల బస్తీ వరదనీటి సమస్య, అల్వాల్ ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ లైబ్రరీ ఏర్పాటు చేయాలని, మూడు డివిజన్లలో సంబంధించి ఇదివరకే ఎమ్మెల్యే పంపించిన ప్రతిపాదనలను మంజూరు చేయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, డోలి రమేష్, శరణగిరి, పవన్ ,ప్రశాంత్ రెడ్డి , సతీష్ , సురేష్ తదితరులు ఉన్నారు



కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

# నానమ్మ గురించి రాస్తా...

హైదరాబాద్, నవంబర్ 21(ప్రభాత ఉదయం) పన్నెండేళ్ల అమ్మాయి పదహారేళ్ల అమ్మాయి గురించి కథ రాస్తే ఎలా ఉంటుంది?! ఏడవతరగతి చదువుతున్న పన్నెండేళ్ల పట్లోళ్ల అక్షయినీ రెడ్డి రాసిన 'ట్రైల్ ఆఫ్ మిస్‌ఫార్చ్యూన్' పుస్తకం ద్వారా మనకు ఈ విషయాలు తెలుస్తాయి.మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మనవరాలు అక్షయినీరెడ్డి.

"మా నానమ్మ ఎంత స్ట్రాంగ్‌గా ఉంటారో రోజూ చూస్తుంటాను. నానమ్మ, అమ్మ, నాన్న.. మా ఇంట్లోని వ్యక్తులే నాకు స్ఫూర్తి. నానమ్మ లైఫ్ గురించి ఒక బుక్ రాయాలనుకుంటున్నాను...' అంటూ ఎన్నో విషయాలను షేర్ చేసుకుంది.

"నాకు కథలపైన ఆసక్తి మొదలైందంటే అమ్మ చెప్పిన స్టోరీస్ వల్లే. రోజూ రాత్రి పడుకునే ముందు అమ్మ రకరకాల కథలు చెబుతుంటుంది. తమ్ముణ్ణి, నన్ను బయటకు తీసుకెళ్లినప్పుడైనా, కాస్త టైమ్ దొరికినా ఏదో చిట్టి కథ ఉంటుంది. సెకండ్ క్లాస్‌లో ఉన్నప్పుడు కథలు చెప్పి, వాటిని షార్ట్ ఫార్మ్‌లో రాసి చూపించమనేది. తర్వాత్తర్వాత పుస్తకాల్లోని కథలు చదివినా, వాటిని ఒక చిన్న పేరాలో రాసి చూపించేదాన్ని..ఈ అలవాటు నాకు పుస్తకాలంటే ఇష్టం పెరిగేలా చేసింది. ఇప్పుడు నా కోసం ఇంట్లో ఓ లైబ్రరీయే ఏర్పాటు చేశారు. ఎక్కువ భాగం ఇంగ్లిష్‌వే ఉంటాయి. ఫారినర్స్ రాసినవి, సుధామూర్తి రచనలు బాగా చదువుతాను. ఒక బుక్ చదివాక బాగా నచ్చితే ఆ బుక్ నుంచి మరొక స్టోరీ రాస్తాను. 'ట్రైల్ ఆఫ్ మిస్ ఫార్చ్యూన్' పుస్తకం అలా రాసిందే. నానమ్మ, నాన్న, అమ్మ, స్కూల్లో టీచర్స్, ఫ్రెండ్స్.. చాలా మెచ్చుకున్నారు.

**బలమైన వ్యక్తిత్వం..**

'ట్రైల్ ఆఫ్ మిస్ ఫార్చ్యూన్' బుక్‌లో పదహారేళ్ల అమ్మాయి పేరు ఆటమ్. ఆమె భావోద్వేగాలు ఈ పుస్తకం నిండా ఉంటాయి. ఒక చిన్న వెకేషన్ కోసం తల్లిదండ్రులను ఒప్పించి మెక్సికోకు బయల్దేరుతుంది. అనుకోని సంఘటనలో తల్లి మరణిస్తుంది. తమ కుటుంబం నుంచి దూరమైన ఆంటోనియోను కలుసుకుంటుంది. క్షేమకరం కాని ఆ ప్రాంతంలో ఉండలేక మెక్సికో నుంచి వాళ్లు లండన్‌కు చేరుకుంటారు. అక్కడ జేమ్సన్ అనే వ్యక్తిని కలుస్తారు. జేమ్సన్ కుటుంబంతో ఉండటమూ క్షేమకరం కాదని అర్థమై తండ్రి, ఆంటోనియోలతో కలిసి జర్మనీకి వెళ్లిపోతుంది. జీవితమెప్పుడూ సంతోషంగా ఉండాలనుకునే ఆటమ్ ప్రతినిత్యం సమస్యలతో చేసే ప్రయాణం గురించి ఈ కథ వివరిస్తుంది. ఆ అమ్మాయి స్నేహాలను ఎలా డెవలప్ చేసుకుంటుంది, ఫ్యామిలీని ఎలా చూసుకుంటుంది, ఒకమ్మాయి ఎంత స్ట్రాంగ్‌గా ఉండాలి అనే విషయాలు నేర్పిస్తుంది. ఇంకో విషయం ఏంటంటే హ్యాపీ ఎండింగ్ తప్పక దొరుకుతుంది అనే హోప్‌ని ఇస్తుంది.

నా ఫ్రెండ్స్ టైటిల్ విషయంలో, కవర్ పేజీ విషయంలో సాయం చేశారు.ఈ బుక్ కోసం ఏడాది పాటు వర్క్ చేశాను. నిజానికి 16 ఏళ్ల అమ్మాయి ఎలా ఆలోచిస్తుంది అనే విషయాలను గురించి అంతగా మ్యాచ్ చేయలేకపోవచ్చు..నా క్లోజ్ ఫ్రెండ్స్ ఇద్దరూ బుక్స్ బాగా చదువుతారు. వారికి ఈ పుస్తకంలో స్నేహపూర్వక స్వభావం,స్ట్రాంగ్ విల్‌పవర్,వ్యక్తిత్వం బాగా నచ్చాయి. నా ఫ్రెండ్స్‌కు నేను రాసిన స్టోరీ నచ్చింది. నా ఫ్రెండ్స్ ఈ బుక్ కొని చాలా సపోర్ట్ చేశారు.స్కూల్లో అందరూ నన్ను అభినందించారు. కొందరు మంచి విమర్శలు కూడా చేశారు.

**ఎంతో నేర్చుకోవాలి..**

రచనలు చేయడంలో చాలా నేర్చుకోవాల్సి ఉందని నాకు ఈ పుస్తకం ద్వారా తెలిసి వచ్చింది. వచ్చిన విమర్శల నుంచి కూడా నేర్చుకుంటున్నాను.స్టోరీలో ఒక పాత్రను ఎలా ముందుకు తీసుకెళ్లాలి,ఆ క్యారెక్టర్‌ని ఎలా డెవలప్ చేయాలి,



నానమ్మ పై రచించిన పుస్తకాన్ని చూపిస్తున్న అక్షయనీ రెడ్డి, నానమ్మ సబితా ఇంద్రారెడ్డి తో అక్షయ్ ని రెడ్డి

స్టోరీ ఎలా రాయాలి..వంటివి నేర్చుకోవాలి.ఇదంతా తెలుసుకుంటూనే నా రచనల్లో వాటిని ఇంక్లూడ్ చేస్తూ వెళ్లాలని ఉంది.ముఖ్యంగా మా నానమ్మ ఎంత స్ట్రాంగ్‌గా ఉంటారో చూస్తుంటాను.

నానమ్మ గురించి ఒక బుక్.. రాయాలనుకుంటున్నాను. అందుకు,నేను ఇంకా చాలా నేర్చుకోవాలి. మంచి రైటర్‌గా,బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా పేరుతెచ్చుకుంటూనే లాయర్‌ని అవ్వాలనే లక్ష్యంతో చదువుకుంటున్నాను. లాయర్‌గా న్యాయం కోసం పోరాటం చేస్తూనే,నా రచనల ద్వారా కొంతమందినైనా ప్రభావితం చేయాలనేది నా ముందున్న లక్ష్యం" అంటూ తెలిపింది ఈ బాల రచయిత్రి.

**టైమ్ క్రియేషన్..**

ఈ బుక్ రిలీజ్ అయ్యాక మా ఫ్రెండ్స్‌తో సహా కొంతమంది నీకు టైమ్ ఎలా సరిపోతుంది అని అడిగారు. నేను టైమ్‌ను క్రియేట్ చేసుకున్నాను. రోజులో ఒక గంటసేపు ఈ బుక్ కోసం కేటాయించుకున్నాను. మొత్తం ఇరవై ఐదు వేల పదాలు. నేనే స్వయంగా టైప్ చేసి, ఎడిటింగ్ చేసుకుంటూ, తిరిగి మార్పులు చేసుకుంటూ రాశాను. దీనిని బుక్‌గా తీసుకురావడానికి అమ్మవాళ్లకు చెప్పకుండానే నలుగురు పబ్లిషర్స్‌తో మాట్లాడాను. వాళ్లు ఆశ్చర్యపోయారు. పబ్లిషర్స్ అమ్మ వాళ్లను అప్రోచ్ అవడంతో... ఈ పని ఈజీ అయ్యింది.



# అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా జనరంజక పాలన

### ధూం..ధాంగా సాగిన కళా ప్రదర్శనలు
### ప్రతిబింబించిన తెలంగాణ సంస్కృతి
### ప్రభుత్వ సంక్షేమ పాలనను ఆవిష్కరించిన కళాకారులు

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 21(ప్రభాత ఉదయం) తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడుతూ జనరంజక పాలనను అందిస్తోందని అదనపు కలెక్టర్(రెవెన్యూ) లక్ష్మీనారాయణ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ లో బుధవారం సాయంత్రం నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ సంబురాలు ఘనంగా జరిగాయి. అట్టహాసపు ఏర్పాట్లతో ఆహ్లాదకర వాతావరణంలో సాగిన కళాయాత్ర ప్రదర్శనలో బృందం ఆటపాటలతో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను చాటుతూ, ప్రభుత్వ సంక్షేమ పాలనను ఆవిష్కరింపజేశారు. ముఖ్య అతిథులుగా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ నరసింహారావు, సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల అన్ని శాఖల జిల్లా అధికారులు, పెద్ద సంఖ్యలో మహిళలు, యువతీయువకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఎంతో ఆసక్తి తో కళాకారుల ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ మాట్లాడుతూ , ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చారని అన్నారు. ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటలలోనే ఆరు గ్యారంటీలలో రెండు గ్యారంటీలను అమలు చేసిందని అన్నారు. మహాలక్ష్మి పథకం కింద రాష్ట్రంలో మహిళలు, ట్రాన్స్ జండర్లకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా అందించే వైద్య సేవల పరిమితిని 5 లక్షల నుంచి 10 లక్షల రూపాయలకు ప్రభుత్వం పెంచిందన్నారు. ఈ పథకం కింద అందించే చికిత్సల సంఖ్యను కూడా 1835 కి పెంచిందని ఎమ్మెల్యే వివరించారు. ప్రగతి భవన్ ను మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ గా మార్చి, ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు "ప్రజావాణి"కి శ్రీకారం చుట్టి, వారంలో రెండు రోజులు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తోందని తెలిపారు. 500 రూపాయలకే వంటగ్యాస్ సిలెండర్ సరఫరా, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వినియోగిస్తున్న గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తోందని తెలిపారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేనివిధంగా తెలంగాణాలో రైతులకు రూ. 31 వేల కోట్ల రూపాయల పంట రుణాలను మాఫీ చేసి అన్నదాతల పట్ల తన చిత్తశుద్ధిని చాటుకుందని అన్నారు. రైతులకు కనీస మద్దతు ధరతో పాటు సన్న బియ్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అందిస్తోందని తెలిపారు. ఏడాది కాలంలోనే 50 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తూ, నిరుద్యోగ యువతలో భరోసా కల్పించేందుకు జాబ్ క్యాలెండర్ ను ప్రకటించిందని గుర్తు చేశారు. హాస్టల్ విద్యార్థులకు కాస్మెటిక్స్, మెస్ చార్జీలను గణనీయంగా పెంచిందని, పాఠశాలల బలోపేతానికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తూ మౌలిక సదుపాయాలు పెంపొందిస్తోందని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పరంగా ప్రయోజనం చేకూర్చాలనే లక్ష్యంతో సామాజిక, ఆర్థిక పరిస్థితుల విశ్లేషణ కోసం ఇంటింటి సమగ్ర సర్వే జరిపిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (%వాదీ%) నర్సింగ రావు, జెడ్పి సీఈవో కాంతమ్మ, అలంపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ మనోరమ, వడ్డేపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ కరుణ సూరి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, పిఎసిఎస్ డైరెక్టర్ సుభాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, అన్ని శాఖల జిల్లా అధికారులు, పెద్ద సంఖ్యలో మహిళలు, యువతీయువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## సమాజ సేవలో...
# తుమ్మల నరసింహులు

### షాద్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం కోసం రూ.51వెలు విరాళం
### అభినందించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డిలు

నందిగామ నవంబర్ 21, (ప్రభాత ఉదయం) షాద్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి తన వంతు సహాయంగా నందిగామ మండలం అంతరెడ్డి గూడ గ్రామానికి చెందిన తుమ్మల నరసింహులు యాదవ్ కుమారుడు వినయ్ కుమార్ యాదవ్ చేతుల మీదుగారూ.51 వెలు విరాళంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు అందజేశారు. సేవా దృక్పథాన్ని చాటుకున్న తుమ్మల నరసింహులు యాదవ్ ను మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి మాజీ జెడ్పిటిసి మామిడి శ్యాంసుందర్ రెడ్డిల్లో ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుల కోసం, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం తనతో చేయి చేయి కలుపుతూ ముందుకు వస్తున్న దాతలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెంది తిరుపతిరెడ్డి, కుమార్ గౌడ్, బాబారాలీఖాన్ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు విరాళం అందజేస్తున్న వినయ్ కుమార్ యాదవ్.

# డిసెంబర్ 1న చలో హైదరాబాద్

### మాలల సింహగర్జన సభకు తరలిరావాలి
### నందిగామ మాల మహానాడు నాయకులు
### ఏకుల వెంకటయ్య, దార లింగం పిలుపు

నందిగామ నవంబర్ 21 (ప్రభాత ఉదయం) ఎస్సీ వర్గీకరణ విషయంలో మాలలకు అన్యాయం జరగకుండా అందరం సంఘటితం కావలసిన అవసరం వచ్చిందని డిసెంబర్1 వ తేదీన హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్ లో మధ్యాహ్నం జరిగే మాలల సింహ గర్జన సభకు భారీ సంఖ్యలోమాలలు తరలిరావాలని నందిగామ మాల మహానాడు నాయకులు ఏ కుల వెంకటయ్య, ధారలింగం లు పిలుపునిచ్చారు. గురువారం నందిగామ మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ కాలనీలో నియోజకవర్గం కన్వీనర్ డాక్టర్ బుచ్చన్న ఆధ్వర్యంలోజరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో మాలల జనాభా తక్కువగా ఉందని, రాజకీయంగా వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని దుష్ప్రచారం జరుగుతుందన్నారు. దుష్ప్రచారాన్ని అందరం ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహేష్, ప్రభయ్య, కో కన్వీనర్లు రామకృష్ణ, జనార్ధన్, అర్జున్ కుమార్, నర్సింలు, రామచంద్రయ్య, మహేష్, యాదయ్య, జంగయ్య, సాయి ప్రేమ్, ప్రభయ్య, ఏకుల జంగయ్య, అంజయ్య, శ్రీకాంత్, రమేష్ తదితరులు ఉన్నారు.



## డేటా ఎంట్రీ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 21(ప్రభాత ఉదయం)సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాల డేటా ఎంట్రీ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి నారాయణ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... సర్వే పూర్తయిన తర్వాత సర్వే ఫారాలలోని అన్ని వివరాలను కంప్యూటర్లలో నమోదు చేయాల్సి ఉంటుందని, వివరాల నమోదు విషయంలో ఆపరేటర్లు ఎలాంటి తప్పులకు ఆస్కారం ఇవ్వరాదన్నారు. సూపర్ వైజర్లు, ఎన్యుమరేటర్లు ఫీల్డ్ విసిట్ పూర్తిచేసిన వెంటనే, వారి సమక్షంలోనే డేటా ఎంట్రీ ప్రారంభించాలని అన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఇప్పటికే గుర్తించి, వారికి అవసరమైన అన్ని సదుపాయాలు సమకూర్చడం జరిగిందని తెలిపారు. మండల స్థాయిలో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర సౌకర్యాలను కల్పించడం జరిగిందన్నారు. ఆపరేటర్లు కంప్యూటర్లో నమోదు చేసేటప్పుడు ఒకటికి రెండు సార్లు జాగ్రత్తగా పరిశీలించాలని,ఆ ఫారాలలో ఏం ఉంటే ఆ వివరాలనే నమోదు చేయాలని తెలిపారు. కుటుంబ వివరాల నమోదును గోప్యంగా ఉంచాలని అన్నారు. మండలాల లాగిన్‌లకు యూజర్ ఐడీలు, పాస్‌వర్డులు అందజేస్తామని అన్నారు.డేటా ఎంట్రీ ఆపరేటర్లు సర్వే సాఫ్ట్‌వేర్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు.మండల స్థాయిలో మాస్టర్ ట్రైనర్లు డేటా ఆపరేటర్లకు శిక్షణ ఇవ్వాలని సూచించారు.శిక్షణలో డేటా ఎంట్రీ విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాస్టర్ ట్రైనర్లకు వివరించినట్లు పేర్కొన్నారు. ఈ సర్వేను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని,సర్వే విజయవంతం కోసం తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సి.ఈ.ఓ కాంతమ్మ, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయత్ రాజ్, మున్సిపాలిటీ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోలు సెంటర్‌లో అధికార పార్టీ నాయకుల మధ్య ఆదిపత్య పోరు

## ఆధిపత్యం కోసం పట్టు పట్టిన ఇరు వర్గాలు

గద్వాల ప్రతినిధి, నవంబర్ 21(ప్రభాత ఉదయం)అధికార కాంగ్రెస్ పార్టీలో వర్గ పోరు పరాకాష్టకు చేరింది. అందుకు నిదర్శనం గద్వాల మండలం బీరొల్లు గ్రామంలో ఐకేపి వడ్ల కొనుగోలు సెంటర్ నిర్వాహణకు ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. గత కొంతకాలంగా గద్వాల నియోజకవర్గంలో అధికార పార్టీలోని కాంగ్రెస్ నాయకులు మధ్య ఆదిపత్య పోరు నడుస్తోంది. నాయకులు రెండు వర్గాలుగా విడిపోవడంతో గ్రామాలలో కూడా రెండు వర్గాలుగా కార్యకర్తలు విడిపోయి ఆధిపత్య పోరుతో ... ఎప్పుడు ఏమి జరుగుతుందో ప్రజలు అయోమయంలో పడే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో తాజాగ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐకేపి ద్వారా మహిళా సంఘాల ద్వారా వడ్ల కొనుగోలు సెంటర్లను నిర్వాహకులకు కేటాయిస్తారు. అయితే గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలను తమకే కేటాయించారంటూ అధికార పార్టీకి చెందిన నేతల వర్గీయులు ఒకరిపై నొక్కరు దాడులకు దిగడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో పరస్పరం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసుకున్నట్లు సమాచారం. వివరాలోకి వెళ్లితే.... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ (ఇందిరా క్రాంతి పథం) ద్వారా మహిళా సంఘాల ద్వారా వడ్ల కొనుగోలు సెంటర్లను అనుమతులిస్తు రైతుల నుంచి వడ్లను కొనుగోలు చేస్తుంది. ఈ క్రమంలో గురువారం గద్వాల మండలం బీరొల్లు గ్రామంలో ఐకేపి సెంటర్ ద్వారా రైతుల



వడ్ల కొనుగోలు కేంద్రం వద్ద గొడవ పడుతున్న ఇరువర్గాలు

నుండి వడ్ల కొనుగోలుకు ప్రభుత్వం సిద్దమవుతున్న క్రమంలో గ్రామంలో ఇరువర్గాలు వడ్ల కొనుగోలు సెంటర్ నిర్వాహణ మాకే కేటాయించారంటూ ఇరువర్గాలు వాగ్వివాదానికి దిగ్గారు. దీంతో వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద ఘర్షణ వాతావరణం నెలకొంది. కాగ... గత అక్టోబర్ నెలలో మహిళ సంఘం ద్వారా ఒక వర్గానికి వడ్ల కొనుగోలు సెంటర్ ఏర్పాటుకు అధికారులు అనుమతులు ఇవ్వగా... అదే ఐకేపీ సెంటర్ నిర్వాహించడానికి నవంబర్ నెలలో మరో వర్గానికి అధికారులు అనుమతులు ఇవ్వడంతో.... ఈ ఘర్షణ వాతావరణానికి కారణమని గ్రామస్తులు ఆరోపించారు. గత సంవత్సరం మహిళా సంఘాల వారికే వడ్ల కొనుగోలు సెంటర్ ను కేటాయించగా... ఈ సంవత్సరం కూడా తమకే కేటాయించాలని కొందరు పట్టు పడినట్లు తెలుస్తోంది. గ్రామాలలో నేతల మధ్య ఉన్న రాజకీయ కారణంగానే బీరొల్లు గ్రామ కొనుగోలు సెంటర్ ను ఈ సంవత్సరం వేరే మహిళా గ్రూప్ లకు ఇచ్చారాని ఆరోపణలు వినవస్తున్నాయి. ఏది ఏమైనా అధికార పార్టీ నాయకుల మధ్య ఆదిపత్యపోరు ఇలాగే కొనసాగుతుందా...లేక అదిష్టానం ఫుల్ స్టాప్ పెడుతుందా వేచి చూడాలి మరీ.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.